ప్రజాశక్తి
బుధవారం 9 ఆగస్టు 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





పాకల తీరంలో
కడలూరు బోట్లు

- ఆందోళనలో మత్స్యకారులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ పరిధిలోని మత్స్యకారులు వేట లేక అల్లాడిపోతున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని కడలూరు బోట్లు వచ్చి ఉన్న చేపలు లాక్కొనిపోతుంటే మత్స్యకారులు చూస్తూ ఉండి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు పట్టించుకోవడం లేదు. గత నెలలో వేట మొదలైన దగ్గరి నుంచి ఇప్పటివరకు చిన్నపాటి వర్షాలు.. ఆపై వడగాలులతో సముద్ర వేటకు ఇక్కడ మత్స్యకారులు పోలేకపోయారు. కానీ తమిళనాడు రాష్ట్రంలోని కడలూరు బోట్లు మాత్రం నిబంధనలు అతిక్రమించి వేట చేస్తున్నాయి. గతంలో మత్స్యకారులు కడలూరు బోట్లు నిలుపుదల చేయాలని అందరినీ వేడుకున్నారు. ఏ శాఖా తమ పరిధి కాదని చేతులెత్తేయడంతో చివరికి మత్స్యకారులే వారిపై పోరాటానికి సిద్ధం చేసుకున్నారు. పాకల ఊళ్లపాలెం గ్రామాల్లో ఉన్న మత్స్యకారులు ఏకమై సముద్రంలో కడలూరు బోట్లు వస్తే మన బోట్లతో వాటిని నిలుపుదల చేయాలని సిద్ధమయ్యారు. ఆ సమయంలో వేట నిషేధం కావడంతో అలా ఆగిపోయింది. ఆగస్టులో ఈ ప్రాంత మత్స్యకారులు వేటకు వెళుతుంటే గోరమెత్తాలు మాత్రమే బోటులో పడుతున్నాయి. కష్టపడి వేట సాగినా కూడా గోరమెత్తాలతో బయటకు వస్తున్నారు. అలా వేట సాగుతున్న నేపథ్యంలో మంగళవారం నాడు ఒక్కసారిగా కడలూరు బోట్లు పాకల, ఊళ్లపాలెం తీరాన్ని కమ్మేసి భారీ బోట్లు, వలలతో చేపలను దోచుకుపోతున్నారు. మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, కోస్ట్ గార్డ్ సిబ్బంది జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని మత్స్యకారులు వాపోతున్నారు.

ఓట్ల తొలగింపు కలకలం!

- దొంగ ఓట్ల పేరుతో
- ప్రతిపక్ష ఓట్లు తొలగించే యత్నం
- నియోజకవర్గాల నుంచి
- వేల ఓట్ల గల్లంతుకు పన్నాగం



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాజకీయాల్లో తమకు వ్యతిరేకంగా ఉన్న వారి ఓట్లు తొలగించాలంటే ముందుగా వాటిని దొంగ ఓట్లు అని పదేపదే చెబితే చాలు.. నిజమేనేమో అవన్నీ దొంగ ఓట్లు అయి ఉంటాయని అనిపిస్తుంది. ఇలా నియోజకవర్గాల్లో ప్రతిపక్షాలకు చెందిన ఓట్లను ఎలాగైనా తొలగించి రానున్న ఎన్నికల్లో అడ్డదారిలోనైనా సరే గెలవడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న అధికార పార్టీ నేతలు దొంగ ఓట్ల పేరుతో తెలుగుదేశం పార్టీకి చెందిన ఓట్లను తొలగించే యత్నాలు ముమ్మరం చేశారు.

ఇందుకోసం ప్రతిపక్షాలకు ఖచ్చితంగా ఓట్లు పడే గ్రామాలు, వార్డులను ఎంచుకొని బూత్ లెవల్ అధికారులు రెవెన్యూ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి పలు రకాల కారణాలతో ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుపుతున్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఈ నెల 21 వరకు ఓట్ల సర్వే జరుగుతుంది. బూత్ లెవల్ అధికారులు ఇంటికికి వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓట్ల తొలగింపు పేరుతో తెలుగుదేశం పార్టీ ఓట్లను భారీగా తొలగించేందుకు వైసిపి నేతలు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో తమకు అనుకూలంగా పని చేసే అధికారులను నియమించుకొని ఓట్ల తొలగింపు పర్వానికి తెర లేపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ మేరకు నియోజకవర్గాల్లో సమావేశాలు పెట్టి మరీ తాము పెద్దఎత్తున దొంగ ఓట్లను గ్రామాల వారీగా గుర్తించామని, వాటిని తొలగించాలని ఎలక్ట్రోరల్ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తగా దరఖాస్తు చేసుకున్న ఓటర్లు తమ వారు కాకపోతే వాటిని రిజెక్ట్ చేయిస్తున్నారు. ఓటర్లకు నోటీసులు ఇవ్వకుండా ఓటును తొలగించడం, రెండు చోట్ల ఓటు ఉన్నాయని చెబుతూ ఓట్లు తొలగించడం, స్థానికంగా లేకపోతే వాటిని దొంగ ఓట్లు అంటూ ముద్ర వేసి భారీగా ఓట్లను తొలగించడం లాంటి పనులు చేస్తున్నారు. అధికార పార్టీ నేతలు చేస్తున్న ఒత్తిడి కారణంగా గ్రామాలు, వార్డుల్లో బిఎల్వోలు ఉన్నవారు ఏమి చెయ్యాల్లో అర్థం కాని స్థితిలో నలిగిపోతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో చాపకింద నీరుగా ఓట్ల తొలగింపులు జరుగుతున్నాయి.

పర్చూరు నియోజకవర్గంలో 40 వేల దొంగ ఓట్లు

పర్చూరు నియోజకవర్గంలో 40 వేల దొంగ ఓట్లు ఉన్నాయని గ్రామాల వారీగా ఉన్న దొంగ ఓట్లను తాము గుర్తించామని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ ఇటీవల విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఇలా దొంగ ఓట్లు లేకపోతే గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు 15 వేల ఓట్ల మెజారిటీతో గెలిచేవారన్నారు. కానీ 1500 ఓట్ల తేడాలో ఓడిపోయారని చెప్పారు. ఒక్క కారంచేడులోనే 2600 దొంగ ఓట్లు ఉన్నాయన్నారు. చిన్నగ్రామం తిమిడితపాడులో కూడా 300 దొంగ ఓట్లు ఉన్నాయని ప్రకటించారు. ఇక్కడ ఆధార్, ఆస్తులు ఉంటే కాదని ఇక్కడ నివాసం ఉంటేనే ఓటన్నారు. పెళ్లి అయి వెళ్లిపోయిన వారు, పనుల కోసం, ఉద్యోగం రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్న వారివి దొంగ ఓట్లుగానే భావిస్తున్నట్లు చెప్పారు.

గత ఎన్నికల్లో వైసిపి తరపున పోటీ చేసి ఓటమి పాలైన డాక్టర్ దగ్గుబాటికి నియోజకవర్గంలో రాజకీయ పార్టీలకు అతీతంగా ఓటర్లు ఉన్నారు. వైసిపితో పాటు టిడిపికి చెందిన వారు కూడా దగ్గుబాటికి ఓట్లు వేశారు. ఎన్నికల్లో ఓట్ల కోసం నగదు పంపిణీ వ్యవహారాలకు దూరంగా ఉండే దగ్గుబాటి ఈ విషయంలో వెనుకబడిన కారణంగానే కొద్దిపాటి ఓట్లతో ఓటమి పాలయ్యారు తప్ప దొంగ ఓట్ల వల్ల కాదనేది ఆయన వర్గీయుల వాదనగా ఉంది. జనరల్ ఎలక్షన్స్ అనంతరం 2020లో జరిగిన స్థానికసంస్థల ఎన్నికల్లో జడ్‌పిటిసి, ఎంపిటిసీలుగా వైసిపి వారే గెలుపొందారు. 2019 ఓటర్ల జాబితా ప్రకారమే ఈ ఎన్నికలు జరిగాయి. తాము దొంగ ఓట్లతోనే గెలిచినట్లా.? అని వైసిపి ప్రజాప్రతినిధులు స్థానిక సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి పులివెందులలో ▶ 2లో

రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

- ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణం పెంచాలి
- ఎస్సీ రైతులకు రూ.కోటి లక్షా
- 20 వేల విలువైన విత్తనాలు పంపిణీ
- రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. స్థానిక అంబేద్కర్ భవనంలో ఎస్‌సి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన పథకం (పిఎంఎజెఎవై) ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 1,012 మంది దళిత రైతులకు రూ. 1,01,20,000 విలువైన విత్తనాల కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు సాధికార సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలలో సేంద్రీయ పద్ధతిలో ప్రకతి వ్యవసాయం చేస్తున్న దళిత రైతులను గుర్తించి వివిధ విత్తనాల కిట్టును పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జొన్నలు, మొక్కజొన్న, జీలగలు, పిల్లి పెసర, జనుములు, రాగి, కొర్ర, సజ్జ, పొద్దుతిరుగుడు, మినుములు, పెసలు, కందులతో పాటు కిచెన్ గార్డెన్ కిట్ పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ నిధులతో రాష్ట్ర విత్తనాల అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా దళిత రైతులకు విత్తనాలు, పిఎండిఎస్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క రైతుకు రూ.1870 విలువైన సీడ్ టు సీడ్ కిట్లు, గట్ల మీద వేసేందుకు కంది, కిచెన్ గార్డెన్ కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు.



విత్తనాల కిట్లను అందజేస్తున్న మంత్రి సురేష్

కాంట్రాక్టు ఇచ్చి..కమీషన్లు నొక్కి..

టిడిపి ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టుల కాంట్రాక్టులు ఇచ్చి కమీషన్లు నొక్కిందే తప్ప వాటి నిర్మాణం గురించి పట్టించుకోలేదని మంత్రి సురేష్ ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి చేయలేక ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత అవే ప్రాజెక్టులపై యుద్ధం అంటూ చంద్రబాబు ప్రాజెక్టులపై పర్యటించడం సిగ్గు చేటన్నారు. రైతుల బాధ రైతు బిడ్డకే తెలుస్తుందన్నారు. రైతుల సమస్యలు తెలుసు కాబట్టే స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం పేరుతో ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్‌గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, సర్పంచి రామావత్ అరుణాబాయి, వైసిపి మండల కన్వీనర్లు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, బివి.సుబ్బారెడ్డి, డిఎల్‌డిఒ సాయికుమార్, తహశీల్దారు కె. రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.



బ్యాంకు అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

స్వానిధి రుణాలను
సద్వినియోగం చేసుకోవాలి

జేసీ కె.శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రధానమంత్రి స్వానిధి రుణాలను వీధి విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలని సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక స్పందన సమావేశ మందిరంలో జిల్లా లీడ్ బ్యాంక్, మెప్మా ఆధ్వర్యంలో పిఎం స్వానిధి కార్యక్రమంపై వీధి విక్రయదారులకు అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. జెసి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా వీది . విక్రయదారులు అతి తక్కువ వడ్డీతో సులభంగా బ్యాంకు రుణాలు పొంది ప్రైవేట్ ఫైనాన్షియర్ల కబంధ హస్తాల నుండి బయటపడవచ్చన్నారు. తద్వారా నెలకు రూ.3 నుండి 5 వేలు అధిక వడ్డీలను వ్యాపారులు చెల్లించకుండా ఈ పథకం ఎంతో ఉపయోగకరమన్నారు. ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ వీధి విక్రయదారులు ప్రతి సంవత్సరం వారి కార్డులను తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని కోరారు. ఒంగోలు మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎల్‌డిఎం అబ్దుల్ రహీం, మెప్మా పీడీ టి. రవికుమార్ మాట్లాడుతూ ఈ పథకాన్ని అందరూ సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీధివిక్రయదారులు రూ.10 వేల నుండి రూ.50 వేల వరకు బ్యాంకు రుణ సదుపాయం, డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు నుంచి రుణాలు పొంది తిరిగి చెల్లించిన విక్రయదారులకు, అధిక రుణాలు మంజూరు చేసిన బ్యాంకు అధికారులు, మెప్మా సిబ్బందిని సన్మానించారు.

నిత్య సేవకుడు హోంగార్డు 'కాశయ్య'

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న చెన్నుపల్లి కాశయ్య పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. చేసేది చిన్నపాటి ఉద్యోగమే అయినా... పెద్ద మనసు చేసుకున్నాడు. దిక్కులేని వారికి నేనున్నానంటూ భరోసా ఇస్తున్నాడు. తనతో పాటు మిత్రుల సహాయ సహకారాలతో సమాజ సేవలో నిరంతరం కొనసాగుతున్నాడు. ఉద్యోగ బాధ్యతలు ముగిసిన వెంటనే సమాజ సేవకు అంకితమవుతున్నాడు. నిత్యం ఏదో ఒక పేద కుటుంబాన్ని గుర్తించడం... ఆ కుటుంబానికి నిత్యావసరాలు... శక్తి మేర ఆర్థికంగా సాయం అందిస్తూ నిత్య సేవకుడిగా మారాడు చెన్నుపల్లి కాశయ్య. హెూంగార్డు చెన్నుపల్లి కాశయ్య గురించి మార్కాపురం పట్టణంలో తెలియని వారుండరు. హెూంగార్డు కంటే కూడా సేవా కార్యక్రమాలతో అందరికీ పరిచయమయ్యాడు. పేద కుటుంబం ఆకలితో ఇబ్బంది పడుతుందని తెలిసిందంటే... అక్కడ ప్రత్యమవుతాడు కాశయ్య. పేద కుటుంబాల్లో ఆకలి బాధలు తీర్చడం ఒక్కటే కాదు... చదువుకునే పిల్లలకు ఆర్థిక సాయం కూడా అందిస్తున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి నగదు సాయంలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. మార్కాపురం పట్టణంలో ఈ విధంగా ఎన్నో కుటుంబాలకు కాశయ్య మిత్రమండలి సహాయ సహకారాలు అందాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. సమాజానికి కాశయ్య స్ఫూర్తిగా నిలిచాడు. తాజాగా మార్కాపురం మండలం గజ్జలకొండ గ్రామంలోని ఎస్సీ పాలెంలో నివసిస్తున్న జమ్మలమడుగు బాలనాగమ్మ అనే వృద్ధురాలు మట్టితో చేసిన బెచ్చుల గోడ ఇంటిలో నివసిస్తోంది. వర్షం కురిసిందంటే ఆ ఇల్లు చెరువనే చెప్పాలి. పైసా చేతిలో లేక... వచ్చే వృద్ధాప్య పింఛను సొమ్ముతో కాలాన్ని సాగదీస్తోంది. మూడు పూటలా తిండికి సైతం ఇబ్బంది పడుతోందని తెలుసుకున్న కాశయ్య తన మిత్రుల సహకారంతో నిత్యావసరాలను సోమవారం అందించాడు. బియ్యం, ఇతర నిత్యావసరాలు నెల రోజులకు ఇబ్బంది లేకుండా సాయం అందించాడు. ఈ సాయంలో కాశయ్య మిత్రులు కటకం రాము, మొఘల్ ఇమ్రాన్‌లు భాగస్వాములయ్యారు. నిత్యం ఏదోక సాయంలో కాశయ్య ముందు పీఠాన నిలుస్తూ... శభాష్ అనిపించుకుంటున్నాడు...!



వృద్ధురాలికి నిత్యసవరాలు అందజేస్తున్న హోంగార్డు కాశయ్య

ఓట్ల తొలగింపులో కలకలం!

(మొదటిపేజీ తరువాయి)

ఓటు ఉంది. ప్రస్తుత నివాసం మాత్రం తాడేపల్లిలో ఉంటున్నారు. అలా అని పులివెందులలో ఓటు తొలగించడం చేయరు కదా అని ప్రశ్నిస్తున్నారు. ఏ ఓటరుకైనా రెండు చోట్ల ఓటు ఉంటే ఒకే చోట ఉంచుకునే హక్కు అతనికే ఉంటుంది. ఇప్పుడు ఓటును కూడా ఆధార్‌తో అనుసంధానం చేసినందున రెండు చోట్ల ఓటు ఉండే అవకాశం లేదు. తాను ఎక్కడ ఓటును ఉంచుకోవాలనేది ఓటరు ఇష్టం.

అర్హులైన ఓట్లను తొలగించే అధికారం ఎవరికీ ఉండదు. ఓటరు దేశంలో ఎక్కడైనా ఓటు హక్కు వినియోగించుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది. స్థానికంగా ఉండేనే ఓటు హక్కు అనేది ఓటరు హక్కులను కాలరాయడమే అవుతుంది. ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం వలస వెళ్లిన వారందరికీ స్వగ్రామంలో ఓటు హక్కు వినియోగించుకునే హక్కు ఉంటుంది. రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గి కొత్త ఓట్లను దొంగ ఓట్లు అంటూ ప్రతిపక్షాల ఓట్లను తొలగించే చర్యలు సరి కాదు.

ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

అధికారుల పొరపాట్ల వల్ల సరైన చోట పోస్టింగ్ పొందలేక ఇబ్బంది పడి డిఇఒ పూల్‌లో కొంత కాలం ఉన్న ఉపాధ్యాయులకు గ్యాప్ పీరియడ్‌కు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించి జీతాలు చెల్లించాలని ఎపిటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జూపల్లి సురేష్, ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ డిమాండ్ చేశారు. వెబ్ కౌన్సిలింగ్‌లో డిఇఒ కార్యాలయ అధికారుల పొరపాట్ల వల్ల చాలామంది ఉపాధ్యాయులు సరైన చోట పోస్టింగ్ పొందలేక తీవ్ర ఇబ్బందులు పడినట్లు తెలిపారు. సిఎస్.పురానికి గణిత ఉపాధ్యాయురాలు డిఇఒ పూల్లో ఉన్నట్లు తెలిపారు. కొంత కాలంగా తర్వాత ఆమెకు పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

'మహాశక్తి'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - గిద్దలూరు

మహాశక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. టిడిపి మహిళానేతలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొంతా లక్ష్మీదేవి, చిటికెన లలిత, నంద్యాల రంగలక్ష్మి, గుంటూరి రవణమ్మ, సండ్రపాటి కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

'స్పందన'లో భూ సమస్యలపై అర్జీలు

గిద్దలూరు రూరల్ : ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో గిద్దలూరు మండలంలో ఎక్కువ శాతం భూ సమస్యలపై అందజేస్తున్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 13 ఏళ్లు జైలు

- సత్ఫలితాలను ఇస్తున్న కోర్టు ట్రయల్ మానిటరింగ్ విధానం
- జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్, పర్చూరు

పర్చూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి జైలు శిక్ష పడింది. నిందితుడు పిల్లి నాగేంద్రబాబు అలియాస్ మోజస్‌కు 13 సంవత్సరాల జైలు శిక్ష, రూ.4వేలు జరిమానాను విధిస్తూ ఒంగోలు 2వ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి ఎంఎ సోమశేఖర్ తీర్పు ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాధితురాలు చీరాల నుంచి పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామానికి అరటికాయలు, మల్లెపూలు తీసుకొని వచ్చి అమ్ముకొని సాయంత్రానికి తిరిగి ఇంటికి వెళ్లేది. 2021వ సంవత్సరం జులై నెల 12వ తేదీన సాయంత్రం 6 గంటలకు అడుసుమల్లి నుంచి పర్చూరుకు రావడానికి గుంటూరు వైపు నుంచి వస్తున్న ఆటోలో ఎక్కగా అందులో బాధితురాలు ఒక్కతే ఉండడంతో నిందితుడు అయిన ఆటో డ్రైవర్ తన ఆటోను దేవరపల్లి గ్రామ పొలాలలోకి వేళ్లే డొంకదారిలోకి తీసుకువెళ్లి బాధితురాలిని చంపుతానని బెదిరించి ఆమెపై అత్యాచారం



నిందితుడు పిల్లి నాగేంద్రబాబు అలియాస్ మోజస్

చేశాడు. బాధితురాలు అతడి బారి నుంచి తప్పించుకొని పర్చూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు అప్పటి ఇంకొల్లు సిఐ పి సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఒంగోలు 2వ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టులో కేసు విచారణ ప్రారంభమైనప్పటి నుంచి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో బాపట్ల డిఎస్‌పి టి వెంకటేశులు సూచనలతో, మార్టూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ టి ఫిరోజ్, పర్చూరు ఎస్‌ఐ ఎన్‌సి ప్రసాద్, కోర్టు కానిస్టేబుల్ ఎమ్ కిరణ్ కుమార్‌లు సాక్షులు నిర్భయంగా కోర్టులో సాక్ష్యం చెప్పేవిధంగా తర్ఫీదు ఇచ్చి సరైన సమయంలో కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. నిందితుడిపై మోపబడిన నేరాన్ని తగిన సాక్ష్యాధారాలతో రుజువు చెయ్యడంతో ఒంగోలు 2వ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి ఎంఎ సోమశేఖర్ నేరస్తుడికి 13 సంవత్సరాల జైలు శిక్ష, రూ.4000/- జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

సత్ఫలితాలిస్తున ట్రయిల్ మానిటరింగ్ విధానం :ఎస్‌పి

ట్రయిల్ మానిటరింగ్ చేసి నిందితుడికి జైలు శిక్ష పడేవిధంగా కృషి చేసిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వకూల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి హెచ్చరించారు. రాష్ట్ర డిజిపి కే రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలతో మహిళ సంబంధిత నేరాలలోని నిందితులకు జైలు శిక్షపడే విధంగా సంబంధిత కేసులలో పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు ట్రయల్ మానిటరింగ్ నిర్వహిస్తున్నారన్నారు. ఈ కోర్టు ట్రయల్ మానిటరింగ్ విధానం సత్ఫలితాలను ఇస్తుందని అన్నారు. పోలీస్ అధికారులే స్వయంగా కోర్టు ట్రయల్‌ను పర్యవేక్షించడం వలన గతంతో పోలిస్తే ప్రస్తుతం కోర్టులో విధించే శిక్షల శాతం పెరిగిందని అన్నారు. జిల్లా ప్రజలు వారి మొబైల్ ఫోన్‌లో దిశ యాప్ డౌన్లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఎస్పీ సూచించారు. ఏదైనా అనుకోని ఆపద సంభవించినప్పుడు దిశ ఎస్‌ఓఎస్ బటన్ ప్రెస్ చేస్తే నిమిషాల వ్యవధిలోనే పోలీసులు ఆ ప్రదేశానికి చేరుకొని రక్షణ కల్పిస్తారని అన్నారు. దిశ యాప్ మీ మొబైల్‌లో ఉంటే మీకు రక్షణగా పోలీసులు మీ వెంట ఉన్నట్లేనని జిల్లా ఎస్పీ తెలిపారు.



పూర్తిగా దగ్ధమైన పూరిగుడిసె

షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

ఎనిమిది గొర్రె పిల్లలు సజీవ దహనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో ఓ పూరి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఎనిమిది గొర్రెపిల్లలు సజీవ దహనమయ్యాయి. ఈ ఘటన పుల్లలచెరువు మండల పరిధిలోని గారపెంట చెంచుగూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... గారపెంటకు చెందిన తాటి అంకాలయ్య పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో బయటికి వెళ్లాడు. అదే సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించి పూరిగుడిసె దగ్ధమైంది. అందులో ఉన్న ఎనిమిది గొర్రె పిల్లలు మృతి చెందాయి. సామగ్రి పూర్తిగా కాలి బూడిదైనట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

నీటి వనరుల పరిరక్షణ చర్యలపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

"నేషనల్ వెట్‌ల్యాండ్ ఇన్వెంటరీ అండ్ అసెస్మెంట్ ప్రోగ్రాం"లో దేశంలో గుర్తించబడిన నీటి వనరుల వివరాలు, రాష్ట్రాల భాగస్వామ్యంతో కేంద్రం చేపట్టిన కార్యక్రమాలపై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల శాఖ సహాయక మంత్రి అశ్వినీ కుమార్ చౌబే సమాధానమిస్తూ మునిగిన లేక స్థిరమైన, సహజ లేక మానవ నిర్మిత, శాశ్వత, మంచి లేదా ఉప్పు నీటి వనరులను వెట్ ల్యాండ్స్‌గా పిలుస్తారన్నారు. దేశంలో నదులు- సరస్సులతో సహా అన్ని నీటి వనరుల పరిరక్షణ, నిర్వహణకు కేంద్ర - రాష్ట్రాల ఖర్చు భాగస్వామ్యంతో కేంద్ర పర్యావరణ, అడవులు వాతావరణ మార్పుల శాఖ ప్రస్తుతం నేషనల్ ప్లాన్ ఫర్ కన్సర్వేషన్ అఫ్ అక్వాటిక్ ఎకో సిస్టమ్స్ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. నీటి నిలుపుదల, వృధా నీటి మళ్లింపు, తీరప్రాంత రక్షణ, సరస్సుల అభివద్ధి, తుఫాన్ నీటి నిర్వహణ, కలుషిత ప్రదేశాలను శుభ్రపరచటం, సరస్సుల సుందరీకరణ, సర్వే, సరిహద్దుల నిర్ణయం, ఫెన్సింగ్, మత్స్య సంపద అభివద్ధి వంటి వివిధ కార్యకలాపాలు ఈ పథకంలో నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలియజేశారు.

భైరవకోనలో 'చింతలచెరువు' ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో రెడ్డి కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల చెరువు సత్యనారాయణ రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత జలపాతాన్ని సందర్శించారు. అనంతరం దుర్గాదేవి, భగ్గులేశ్వర, నగరేశ్వర, కాలబైరవ ఆలయల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు బోర్డు మాజీ వైస్ చైర్మన్ సిద్ధు వెంకట్ రెడ్డి, ఆలయ పూజారులు కంబాలదిన్నె వెంకట నరసయ్య, పంచాఙ్గుల రామమూర్తి శర్మ, సుధాకర్ శర్మ తదితరులు చింతల చెరువు సత్యనారాయణ రెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సత్యనారాయణ రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం రూ 10 లక్షలతో నిర్మిస్తున్న విశ్రాంతి షెడ్డుకు సత్యనారాయణ రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సిద్ధు వెంకటరెడ్డి, తురకపల్లి గ్రామ సర్పంచి రవీంద్రారెడ్డి, రామ సత్యనారాయణ రెడ్డి, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

సిఎం ఇచ్చిన హామీలు అమలుచేయాలి

- విఆర్‌ఏ సంఘ గౌరవాధ్యక్షులు గంటెనపల్లి శ్రీనివాసులు
- డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పాదయాత్ర సందర్భంగా సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి విఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు గంటెనపల్లి శ్రీనివాసులు డిమండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ విఆర్‌ఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రకాశం భవనం వద్ద గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో 2వ రోజు దీక్షలను జిల్లా అధ్యక్షులు పి.యాకోబు ప్రారంభించారు. ఈ సందర్భంగా జి.శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నా జరుగుతున్నప్పుడు పాదయాత్రలో భాగంగా శిబిరం దగ్గరకు వచ్చి రాబోయేది మన ప్రభుత్వమని అధికారంలోకి రాగానే వేతనాలు పెంచి మీ సమస్యలన్నీ తీరుస్తానని చెప్పి సిఎం హామీ ఇచ్చారన్నారు. నాలుగున్నర ఏళ్ళుగా విఆర్‌ఏల సమస్యలపై దృష్టి సారించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే పే స్కేలు అమలు చేస్తున్నారని, ఇతర శాఖలకు సర్ధుబాటు చేశారన్నారు.



డిఆర్‌ఒకి వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఏలు

ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హమీలను నెరవేర్చాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి పాలడుగు వివేకానంద మాట్లాడుతూ ఇప్పటికైనా అర్హులైన వారికి వి.ఆర్‌ఏలను వి.ఆర్‌ఒలుగా పదోన్నతులు ఇవ్వాలన్నారు. జిల్లాలో ఎప్పటి నుండో పెండింగులో వున్న అటెండర్ ప్రమోషన్లను ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం వేతనాలు పెంచుతున్న ప్రకటన చెయ్యకపోతే ఈనెల 23, 24, తేదీలలో రాష్ట్ర దీక్షలలో పాల్గొంటామన్నారు. "చలో "విజయవాడ"కు పిలుపునివ్వటంతో జిల్లాలోని విఆర్‌ఏలు ప్రభుత్వంతో చావో, రేవో తేల్చుకుంటామని హెచ్చరించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలతను కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వరికూటి శ్రీనివాసరావు, స్వాములు, సాల్మన్, నాగరాజు, రాజు, వినయ్, విజయ, విఆర్‌ఏలు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి ఖర్చు చేయాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్థానిక సంస్థలలో ఏర్పడిన రెండు సర్పంచ్, 63 వార్డు సభ్యులకు ఎన్నిక నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించటంతో అభ్యర్థులు నిబంధనలకు లోబడి ఖర్చు చేయాలని అదనపు జిల్లా ఎన్నికల అధికారి, డిపిఒ జివి నారాయణ రెడ్డి సూచించారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల నిబంధనలు 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ విధంగా ఉన్నాయన్నారు. 10వేలు అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలలో సర్పంచ్ అభ్యర్థి రూ.2.50 లక్షలు, వార్డు సభ్యులు రూ.50 వేలు ఖర్చు చేయాలన్నారు. 10వేలు కంటే తక్కువ ఉన్న పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థి రూ.1,50,000లు, వార్డు సభ్యులు రూ.30 వేలు ఖర్చు చేయాలన్నారు. అన్ని చోట్ల కచ్చితత్వంతో ఎటువంటి అవాంతరాలకు తావు లేకుండా నిబంధనల మేరకు ఎన్నికల విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో స్టేజ్1 అధికారులు, మండల పరిషత్ అభివద్ధి అధికారులు, విస్తరణాధికారులు, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విచారించి చర్యలు తీసుకోండి

డిఈఒకు సిఎస్‌ఈ ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నకిలీ కుల ధృవీకరణ పత్రాలతో ఉపాధ్యాయులుగా జంపన కష్ణ కుమార్, పేరూరి బాల శివకుమార్ ఎంపికయ్యారనే ఫిర్యాదులపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్(సిఎస్ఇ) జిల్లా విద్యా శాఖాధికారిని ఆదేశించారు. సెకండరీ గ్రేడ్ టీచర్ గుడ్డపాతల సుబ్బారావు మరణించారని, వీరి కుటుంబ సభ్యులకు బెనిఫిట్స్ అందలేదని, జి. పూర్ణ చంద్ర కుమార్ కమిషనర్ కు ఫిర్యాదు చేయగా ఈ ఫిర్యాదును పరిశీలించాలని కమిషనర్ డిఇఒను ఆదేశించారు.

హత్య కేసులో రూ.8.25 లక్షల రిలీఫ్ మంజూరు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌టి ఎరుకులకు చెందిన దేవరకొండ రత్తమ్మ హత్య కేసులో దళిత నేత నీలం నాగేంద్రరావు కృషితో రూ.8.25 లక్షల రిలీఫ్ మంజూరైంది. చీమకుర్తి పట్టణం వెంకటేశ్వర నగర్‌కు చెందిన దేవరకొండ రత్తమ్మ అనే ఎస్‌టి(ఎరుకుల) మహిళ గత సంవత్సరం ఫిబ్రవరి 14న హత్యకు గురైంది. ఆమెతో సహజీవనం చేస్తున్న వ్యక్తి ఆమెను గొంతు పిసికి హత్య చేశాడు మృతురాలు రత్తమ్మకు నలుగురు పిల్లలు ఉన్నారు. వారిలో సంతనూతలపాడులో నివసించే రత్తమ్మ కుమార్తె దుర్గా తమకు న్యాయం చేయాలని నీలం నాగేంద్రని ఆశ్రయించారు. రత్తమ్మ హత్య కేసును పరిశీలించిన దళిత నేత నీలం సాధారణ హత్య కేసుగా నమోదైన కేసును ఎస్సీ,ఎస్టీ హత్య కేసుగా మార్పించారు. రత్తమ్మను హత్య చేసింది ఎస్‌టి కాదని, బిసి కులానికి చెందిన వ్యక్తి అని అప్పుడు ఒంగోలు డి.ఎస్.పి నాగరాజు దృష్టికి నీలం తీసుకొచ్చారు. డిఎస్‌పి నిర్ధారించుకొని ఎస్సీ,ఎస్టీ యాక్ట్‌గా చార్జిషీట్ కోర్టులో ఫైల్ చేశారు. రత్తమ్మ హత్య కేసులో వారసులందరినీ పిలిపించి చీమకుర్తి తహశీల్దార్ మధుసూదన్‌రావు అర్హులైన కుటుంబ సభ్యుల రిలీఫ్ ప్రతిపాదన కలెక్టరేట్‌కు పంపారు. ఈలోపు ఎస్సీ ఎస్టీ కోర్టులో నిందితునికి జీవిత ఖైదీ విధించారు. ఎస్‌టి మహిళ హత్య కేసులో ఎట్టకేలకు రూ.8.25 లక్షల రిలీఫ్ మంజూరు చేశారు.



చెరువులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చీరాల

నీటిలో పడి గుర్తుతెలియని వ్యక్తి మతిచెందిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. రెండో పట్టణ సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... పేరాల గాంధీనగర్ లో కోర్టు వెనుక ఉన్న కుందేరు నీటిలో గుర్తుతెలియని వ్యక్తి పడి మతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. దీంతో రెండో పట్టణ సీఐ సోమశేఖర్ సిబ్బందితో అక్కడకు చేరుకుని మతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం కోసం చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాలకత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి కాలుజారి నీటిలో పడి మతిచెంది ఉండవచ్చని పోలీసులు బావిస్తున్నారు. మతుడు సుమారు 5 అడుగుల ఎత్తు, వయస్సు 50 సంవత్సరాలకు పైబడి ఉంటాయన్నారు. ఆకుపచ్చ రంగు ప్యాంటు, ఆకుపచ్చ రంగు గళ్ల చొక్కా ధరించి ఉన్నాడని, ఇతనికి సంబంధించిన వివరాలు తెలిస్తే రెండో పట్టణ పోలీసులకు తెలియజేయాలని సీఐ చెప్పారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నేటి నుంచి 'నా మట్టి, నా దేశం'

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఆజాదికా అమృత్ మహోత్సవం, 'నా మట్టి నా దేశం' కార్యక్రమాలను నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి రాజేష్ అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ హాలులో ఎంపిపి వై ఎలమంద అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఆయా తేదీలలో జరిగే కార్యక్రమాలతో పాటు సైకిల్ ర్యాలీలు, స్కూటర్ ర్యాలీలు, ఫ్లాగ్ మార్చ్, స్వాతంత్ర్య సమరయోధుల గృహాలను సందర్శించడం, స్వచ్ఛభారత్ కార్యక్రమం, స్కూలు, కాలేజీలలో డిబేట్ పోటీలు, రంగోలి, బ్లడ్ డొనేషన్ క్యాంపులను ప్రజాప్రతినిధులతో కలిసి నిర్వహించి విజయవంతం చేయాలని ఆయన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపిడిఓ సిహెచ్ కృష్ణ, ఎపిఎం డి మస్తాన్‌రావు, గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసీలు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సీడ్ బాల్స్' తయారీ

ప్రజాశక్తి-చీరాల

చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలలో భాగంగా దేశాయిపేట, హైస్కూల్‌లో మొక్కలు పెంచేందుకు అవసరమయిన, 'సీడ్ బాల్స్' బంకమట్టి, 4 రకాల విత్తనాలు కలిపి విద్యార్థులచే తయారు చేయించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వర్షాకాలంలో ఈ సీడ్ బాల్స్ రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాలలో చల్లి, పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లను పెంచాలని, చీరాలకు చల్లని గాలి తీసుకురావాలని, లక్ష మొక్కలు నాటాలని రోటరీ క్లబ్ కృత నిశ్చయంతో ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, సిహెచ్ బాల వెంకటేశ్వరరావు, వలివేటి మురళీకృష్ణ, డివి సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేతనాలు పెంచాలని ఎంఇఒకు వినతి అందిస్తున్న సిఐటియు నాయకులు

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం పెంచాలి

ప్రజాశక్తి-కొల్లూరు

మధ్యాహ్న భోజన పథకం కింద పనిచేస్తున్న నిర్వాహకులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ఎంఇఒ జ్యోతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని కార్మికుల వేతనం ఒకేసారి ఎకౌంట్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చంద్రలీల, మరియమ్మ, కనకమని తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల స్థాపన కోసం వసతుల పరిశీలన

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలంలోని నూతలపాడులో వైవి సుబ్బారెడ్డి డిగ్రీ, పీజీ, నర్సింగ్ కళాశాలల ఏర్పాటుకు అధికారులు మౌలిక వసతులను పరిశీలించారు. మంగళవారం ప్రాంతీయ ఉన్నత విద్యా సంచాలకులు జ్యోత్స్న కుమారి నూతలపాడు విద్యేసి జూనియర్ కళాశాల భవనాలు, ఫర్నిచర్, కంప్యూటర్‌లను పరిశీలించారు. ఇతర వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పర్చూరు బిఎఆర్ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ చింపారెడ్డి, చీరాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమణమ్మ, గ్రామ సర్పంచ్ కొక్కర్లమూడి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అమ్మినా, కొన్నా చర్యలు: ఎస్‌పి

- గంజాయి ముఠాపై జిల్లా ఎస్పీ ఉక్కుపాదం
- 9 మంది అరెస్టు, రిమాండ్
- రూ.2.35 లక్షల విలువ గల 23 కేజీలు స్వాధీనం



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి-చీరాల

ప్రభుత్వ నిషేధిత గంజాయి, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలను అమ్మినవారు, కొన్నవారు, సహకరించిన వారందరిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపిస్తుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. చీరాల ప్రాంతంలో గంజాయి క్రయ విక్రయాలకు పాల్పడుతున్న ఓ ముఠా గుట్టును డిఎస్పి ఆధ్వర్యంలో రూరల్ పోలీసులు రట్టు చేశారు. 9 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ విషయంపై మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ మీడియాతో మాట్లాడారు. గంజాయిపై జిల్లా పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోందని పటిష్ఠ నిఘాతో గంజాయి కేసులోని 9 మంది నిందితులను అరెస్టు చేసి వారిని రిమాండుకు తరలించామని అన్నారు. చీరాల రూరల్ సీఐ మల్లికార్జునరావుకు గంజాయి రవాణా అమ్మకాల గురించి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు రూరల్ సీఐ మల్లికార్జునరావు ఎస్ఐ పి జనార్దన్ సిబ్బందితో కలిసి కావూరివారిపాలెం సమీపంలో యదల మ్మ చెట్టు వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో అక్కడ కొందరు వ్యక్తులు పోలీసుల రాకను గమనించి పారిపోయేందుకు యత్నించగా సిబ్బంది అప్రమత్తమై పరారవుతున్న యువకులలో జీవన్ కుమార్, విజయ్ కుమార్ అలియాస్ టింకు లను అదుపులోకి తీసుకొని విచారించారు. స్టువర్టుపురానికి చెందిన తిమోతి అనే వ్యక్తి గంజాయిని సునీల్ దగ్గర నుంచి తీసుకొని వచ్చి వారితో అమ్మకాలు జరిపేవారని అతను అందుబాటులో లేకపోవడంతో సునీల్‌ను సంప్రదించగా గంజాయి సరఫరాదారులు బోగిరి ప్రదీప్, పూజారి ప్రేమ్‌చంద్, మత్ర శ్రావణ్ కుమార్‌లు ముగ్గురు వెదుళ్లపల్లి ఘటనలో ప్రస్తుతం జైలులో ఉన్నారని, వారి నుంచి సేకరించి ఉంచిన 23 కేజీల గంజాయిని సునీల్ తీసుకువచ్చి ఇచ్చారని అందులో కొంత గంజాయిని మిగిలిన గంజాయి వారి వద్ద ఉన్నట్లు చెప్పారని తెలిపారు. వారి వద్ద ఉన్న 21 కేజీల గంజాయిని స్వాధీన పరుచుకున్నారు. ఆపాటికే పారిపోయిన పలువురి కోసం గాలిస్తుండగా శివారెడ్డి రొయ్యల చెరువు వద్ద కొందరు యువకులు పారిపోవటాన్ని గమనించి అప్రమత్తమై వానపల్లి అజయ్‌కుమార్, కోటా శ్రీరాములు, పసల బాలస్వామి మొగిలిశెట్టి శేషు, మా స్వామి, బల్లాని శివశంకర్, కాశీ సాయి ఈశ్వర తేజ, కర్రెద్దుల ప్రవీణ్ కుమార్‌లను అరెస్టు చేశారు. వారు సేవించేందుకు కొనుగోలు చేసిన సుమారు రెండున్నర కేజీల గంజాయిని స్వాధీనపరుచుకున్నారు. మొత్తంగా తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేయగా చీరాలకు చెందిన సునీల్, స్టువర్ట్ పురానికి చెందిన చిత్తూరు తిమోతి పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితుల నుంచి సుమారు రూ.2.35 లక్షల విలువగల 23 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించినట్లు తెలిపారు. డిఎస్‌పి ఎస్ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో చీరాల రూరల్ సిఐ ఏ మల్లికార్జునరావు, చీరాల రూరల్ ఎస్సై పి జనార్దన్, చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్స్ వెంకయ్య, పిచ్చియ్య, పోలీస్ కానిస్టేబుల్స్ కపోరావు, నాగాంజనేయులు, భాస్కర్‌రావు, నాగరాజు, హోంగార్డు శ్రీనివాసరావు సహాయంతో పై గంజాయి కేసులోని నిందితులను అరెస్ట్ చేశారు. గంజాయి కేసును ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అధికారి సుబ్బారావు

మీ భూమి-మా హామీ సర్వే 60శాతం పూర్తి

ప్రజాశక్తి-రేపల్లె

పట్టణంలో నిర్వహిస్తున్న మీ భూమి-మా హామీ కార్యక్రమాన్ని ఇప్పటికే అధికారులు 60 శాతం వరకు పూర్తి చేశారని, మిగిలిన సర్వేను వేగవంతంగా నిర్వహించాలని రీసర్వే ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి డి సుబ్బారావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సర్వే సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మీ ఇంటికి మీ భూమి పథకం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఖచ్చితమైన కొలతలతో గుర్తించటం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పంట పొలాలకు పాసు బుక్‌లు ఉన్న మాదిరిగా పట్టణ ప్రాంతాలలో భూములు, ప్లాట్లు కలిగిన హక్కుదారులకు నిర్దిష్టమైన కొలతలు తెలియజేస్తూ సర్టిఫికెట్‌లను జారీ చేయటం జరుగుతుందన్నారు. అక్టోబర్ మాసానికి నూరుశాతం సర్వే పూర్తి చేసి భూయజమానులకు సంబంధిత పత్రాలను అందజేసేందుకు పత్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...



పాతమాగులూరులో మహాశక్తి చైతన్య యాత్ర నిర్వహిస్తున్న తెలుగు మహిళా నాయకులు

మహాశక్తి చైతన్య యాత్ర

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఆడపడుచులకు స్వతంత్ర ప్రతిపత్తితో కూడిన సమజీవనం కల్పించాలన్నదే తెలుగుదేశం పార్టీ ఆశయమని బాపట్ల పార్లమెంట్ తెలుగు మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి నాగబోతు సుజాత తెలిపారు. మంగళవారం మహాశక్తి చైతన్య యాత్ర కార్యక్రమంలో భాగంగా, మండలంలోని పాత మాగులూరు గ్రామంలో ఇంటింటికి వెళ్లి మహిళలకు చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పథకాలను తెలుగు మహిళ విభాగం నేతలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించడం మొదలు స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు వరకు తెలుగుదేశం పార్టీ పాలనలో తీసుకున్న నిర్ణయాలేనని వారు తెలిపారు. ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగడం, మహిళలకు భద్రత, యువతకు బంగారు భవిష్యత్తు అందించడం కోసం తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ మహాశక్తి మినీ మేనిఫెస్టోను విడుదల చేయడం జరిగిందని గ్రామ మహిళలకు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యనిర్వ కార్యదర్శి గుమ్మా జ్యోతి, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు కొనికి గోవిందమ్మ, అరుణ, చింతా రమాదేవి, మనోహరమ్మ తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్ ఎన్నికల నోటిఫికేషన్

రేపల్లె ఎంపిడిఓ శివపార్వతి

ప్రజాశక్తి-రేపల్లె: మండలంలోని పలు పంచాయతీలలో ఖాళీ అయిన వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ శివపార్వతి తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని బేతపూడి పంచాయతీలో 7వ వార్డు, రాజు కాల్వలో 5వ వార్డు, చాట్రగడ్డలో 3, 8వార్డులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిందని తెలిపారు. వివిధ వార్డులకు సంబంధించి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ, 14న అభ్యర్థుల పేర్లను ప్రకటించటం జరుగుతుందని అన్నారు. 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఎన్నికలు, 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రకటన చేస్తారన్నారు. ఈ ఎన్నికలలో పోటీ చేసుకునేందుకు పూర్తి వివరాలకై స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో, ఆయా పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.



అభివృద్ధికి దూరంగా చెంచులు

- పూరిపాకల్లోనే జీవనం
- అంతరించి పోతున్న చెంచు సంతతి
- కనీస సౌకర్యాలు కరువే..
- ఆదరించని ఐటిడిఎ
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



పూరిపాకలో నివసిస్తున్న గిరిజనులు



అటవీ ఫలసాయం తెచ్చుకుంటున్న గిరిజనులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఆదివాసీల మనుగడకు అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. దీంతో వారు అభివద్ధికి దూరంగా ఉంటున్నారు. అడవినే నమ్ముకుని అక్కడే ఉంటున్నారు. వారి జీవనం, సంస్కృతి, సంప్రదాయాలలో వైవిధ్యం ఉంటుంది. నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నల్లమల గిరిజనుల జీవనంపై ప్రత్యేక కథనం.

ఆదిమ గిరిజన తెగల్లో ద్రావిడ జాతికి చెందిన ఆటవిక తెగ చెంచు. చెట్టు అనే పదం నుంచి చెంచు వచ్చినట్లు పరిశోధకులు చెబుతారు. వీరి చరిత్ర, సంస్కృతి, సమకాలీన వ్యవహారాలపై చాలా పరిశోధనలు జరుగుతున్నాయి. 17వ శతాబ్దంలో ఫెరిస్టా అనే చరిత్రకారుడు చెంచుల జీవనం గురించి అధ్యయనం చేశారు. 1943లో హెమండార్ఫ్ రాసిన పుస్తకంలో చెంచుల ప్రస్థావన ఉంది. దేశంలో అత్యంత వెనుకబడిన తెగగా నల్లమల చెంచులను ప్రభుత్వం గుర్తించింది. వీరి జనాభా నానాటికీ క్షీణిస్తోంది. వీరి సంరక్షణకు సమీకత గిరిజనాభివద్ధి సంస్థ ఏర్పాటు చేశారు. అయినా ఆశించిన ఫలితాలు రావడం లేదు.

చెంచుల్లో అడవి చెంచులు, ఊర చెంచులు అనే తెగలు ఉన్నాయి. నల్లమలలో కష్ణానదికి ఇరువైపులా ఉండే కొండ, లోయ ప్రాంతాల్లో నివసించే వారిని అడవి చెంచులు, కొండ చెంచులు అని పిలుస్తారు. గ్రామాల్లో తిరుగుతూ భిక్షాటన చేసేవారిని ఊర చెంచులు అంటారు. వీరినే కష్ణ చెంచులు, చెంచుదాసరులు అని కూడా పిలుస్తారు. వీరు ప్రత్యేకమైన వేషాధారణలో గంట (లోహపు పలక) వాయిస్తూ గ్రామాల్లో సంచరిస్తారు. గ్రామస్తులు ఇచ్చిన బట్టలు, పెట్టిన భోజనంతో జీవితం గడిపేస్తారు. అయితే ఆధునిక కాలంలో అడవి చెంచులు, ఊర చెంచుల జీవనంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పూర్తిగా అడవుల్లో నివసించేవారి పరిస్థితి ఇప్పటికీ దయనీయంగానే ఉంది. బక్కపలచగా, పొట్టిగా, చెదిరిన ఉంగరాల జుట్టు, అమాయకపు ముఖం, చప్పిడి ముక్కు, నలుపు లేక రాగిరంగు చర్మంతో ఉంటారు. ఎప్పుడూ అడవిలో సంచరిస్తూ అటవీ ఫలసేకరణ, చిన్న జంతువుల వేట ద్వారా జీవనం సాగిస్తున్నారు.

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం..

ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీలు అంతరించిపోతున్న తరుణంలో వారి సంరక్షణ దిశగా ఐక్యరాజ్యసమితి చర్యలు చేపట్టింది. ప్రతియేటా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని 1994లో ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతియేటా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సిఎస్.పురం

ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం 21వ రాష్ట్ర మహాసభల ఈనెల 21, 22 తేదీల్లో విజయవాడలో నిర్వహి స్తున్నారు. అందులో భాగంగా రాష్ట్ర మహా సభలకు సంబ ంధించిన వాల్‌పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు మంగళవారం ఆవిష్కరించారు. మండల పరిధిలోని శీలవారిపల్లెలో కనిగిరి నియోజక వర్గం ఎన్‌జిఒ ప్రతినిధులు బాబూరావును కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు వచ్చేలా సేవలందించి ప్రజల అభిమానం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ అధ్యక్షుడు పులి రమణారెడ్డి, కార్యదర్శి సింగంపల్లి నరసింహారావు, ఎపిఎన్‌జిఒ ఉపాధ్యక్షుడు ఎస్‌కె.రషీద్‌బాష, ఎస్‌కె.హజరత్ అలీ,మహిళా అధ్యక్షురాలు అరవింద, సింగంపల్లి రాంప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ మెంబర్ రవీంద్ర, మహేష్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసను అరికట్టాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మణిపూర్‌లో శాంతి నెలకొల్పి హింసను అరికట్టాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని కోరుతూ కెవిపిఎస్ ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో త్రోవగుంట అంబేద్కర్ బొమ్మ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ గత రెండు నెలలుగా మణిపూర్‌లో కుక్కి ఆదివాసి ప్రజలపై జరుగుతున్న దాడులను తక్షణమే అరికట్టాలన్నారు. దేశం తలదించుకునేలా మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి హత్య చేయడం దుర్మార్గమన్నారు. నేటికీ ఆ రాష్ట్రంలో దాడులు జరుగుతుండడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలన్నారు. సిఐటియు నగర నాయకులు తంబి శ్రీనివాసులు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వాతంత్రం వచ్చి నేటికీ 75 సంవత్సరాలు గడుస్తున్నా గిరిజనులు, దళితులపై దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు కె. శ్యామ్, సుబ్బారావు, వెంకటేశ్వర్లు ,హనుమంత రావు, నాగేశ్వరరావు చిరంజీవి, చలపతి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

సంపన్నుల కోసమే

అసైన్డ్ భూముల చట్ట సవరణ

వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-కనిగిరి

సంపన్నుల కోసమే అసైన్డ్ భూముల చట్ట సవరణ అని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు అధ్యక్షతన అసైన్డ్‌భూముల చట్ట సవరణ ఎవరికి ప్రయోజనం అనే అంశంపై మంగళ వారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు పేదల జీవితాల్లో ఆర్థిక సమానత్వం, సామాజిక న్యాయం సాధన కోసం ప్రభుత్వాలు భూమిని పంపిణీ చేసినట్లు తెలిపారు. అందులో అత్యధిక శాతం భూములు అన్యాక్రాంతమయ్యామన్నారు. వ్యవసాయ కూలీలు,పేదలకు భూములు పంపిణీ చేయాలని అనేక పోరాటాలు చేయటం వల్ల పేదలకు భూములు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆ భూములను అసైన్‌మెంట్ భూములుగా పిలుస్తున్నామని వాటిని నాయకులు, పెత్తందారులు పదోపరకో ఇచ్చి, బెదింపులకు పాల్పడి అక్రమించుకున్నట్లు తెలిపారు. అవి అన్యాక్రాంతం కాకుండా పేదలకు దక్కాలే మరో చట్టాన్ని తీసుకురావాలని పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. సంపన్నుల కోసం ఈ చట్ట సవరణ తీసుకొచ్చినట్లు తెలిపారు. అన్యాక్రాంతమైన భూములను అక్ర మార్కులకు హక్కు కల్పించేలా కొత్తగా చట్టం తేవటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అక్రమార్కుల చేతుల్లో ఉన్న భూములను స్వాదీనం చేసుకుని పేదలకు పంచాలన్నారు. లేకపోతే పేదలను సమీకరించి జండాలు పాతి అర్హులకు దక్కేలా ఉద్యమిస్తామన్నారు. తక్షణమే ఈచట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు పిల్లి తిప్పారెడ్డి, సిఐటియు నాయకులు పిమహేశ్,వివిధ సంఘాల నాయకులు జిపి.రామారావు, జి.రవికుమార్,కె.వెంకయ్య,డి బ్రహ్మంగౌడ్, ఆర్. మాలకొండయ్య,కె ఏబు, ఎస్‌కె ఖాదర్‌వలి, కె వెంకటసుబ్బారెడ్డి, చిన మాలకొండయ్య, బి.జనార్ధన్, ఇస్సాక్, రాములు, ఏలియా, బెంజి, వెంకటకొండయ్య, జి. సురేష్, జెపి.రాజు,చక్రి, ఏసోబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు



గడపగడపకూలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-దర్శి

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. దర్శి నగర పంచాయతీలోని 17వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకు, కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, కమిషనర్ మహేష్, నాయకులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, కౌన్సిలర్ విసిరెడ్డి, హరీష్, భాస్కరరెడ్డి, రమణారెడ్డి, వివిధశాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది , వాలంటరీలు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- సంతనూతలపాడు

సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామంలో విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బెతూన్ నర్సింగ్ హోం వారి మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.కిరణ్ కుమార్,గ్రామ పంచాయతీ సర్పంచి దాట్ల రమణమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్య, వైద్యం ప్రజలకు అందుబాటులో లేకుండా ఖరీదైన వ్యాపారంగా మారిన నేపథ్యం లో విజ్ఞాన కేంద్రం ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందన్నారు. బెతూన్ నర్సింగ్ హోం ఎముకల డాక్టర్ ఎస్.సందీప్ ప్రకాష్ వైద్య సేవలందించారు. మొత్తం100 మంది వైద్య సేవలు వినియోగిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కిలారి పెద్దబ్బాయి,షేక్ కమాల్,షేక్ నాయబ్, కరిచేటి హనుమంతరావు, టి.అంజయ్య, టి.వంశీ తదితరులు పాల్గొన్నారు.

60 శాతం ఓటరు సర్వే పూర్తి

ప్రజాశక్తి-కొండపి

కొండపి నియోజకవర్గంలో ఇప్పటి వరకూ బిఎల్‌ఒలు 60 శాతం ఓటరు సర్వేను పూర్తి చేసినట్లు కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇఆర్‌ఒ నారథముని తెలిపారు. తహశీల్దారు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారథముని మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకూ ఇంటింటీ సర్వే 60 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. సర్వేకు మరో రెండు వారాలు గడువు ఉందని మిగిలిన 40 శాతం కూడా త్వరగా పూర్తి చేసి తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల తహశీల్దార్లు , రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండల పరిధిలోని పూరిమెట్ల గ్రామంలో మెంటర్ సాకప్ప ఆధ్వర్యంలో రైతులకు ఘన జీవామతం తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాకప్ప మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులు వినియోగించడం వల్ల భూములు నిసారంగా మారుతున్నట్లు తెలిపారు. నిసారమైన భూమిలో ఆవు పేడ, ఆవు పంచకంతో తయారు చేసుకున్న ఘనజీవామతం ఎకరానికి 400 కిలోలు చొప్పున వినియోగిస్తే సారవంతం అవుతుందన్నారు. భూమిలో నిద్రావస్థలో ఉన్న సూక్ష్మజీవులను ఘనజీవామతం వేసి మేల్కొల్పితే భూమిని గుల్లపరిచి మొక్కకు కావలసిన పోషకాలను అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది ఎంటి ప్రభాకర్, ఇన్‌ఛార్జి శివనాగిరెడ్డి ఐసిఆర్‌పి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దోర్నాలలోని బొగ్గరపు సత్యమమ్మ కళ్యాణ మండపంలో నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ డాక్టర్ రవీంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆది మూలపు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొం టారన్నారు. చెంచు విటిడిఎ వైస్ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, గిరిజన మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు, చెంచు స్టేట్ లెవెల్ కమిటీ సభ్యులు, చెంచు సర్పంచులు, చెంచు గిరిజనులు పాల్గొని ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మిర్చి రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-దర్శి

రైతులు మిరప సాగులో మెలకులువల పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఎంఆర్‌ఎస్ కీటక విభాగం శాస్త్రవేత్త రాజేష్ చౌదరి తెలిపారు.స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో మర్చి రైతులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ చౌదరి మాట్లాడుతూ రైతులు ఖరీఫ్‌లో వేసే విత్తనాలు రైతులు నాణ్యమైన విత్తనాలు విత్తుకుని అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఉష, మానస, ప్రాసెసింగ్ డిపికె బాబూరావు, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-చీమకుర్తి

ఈనెల 10న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు బండ్లమూడి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ నవీన్ తెలిపారు. మండల పరిధిలోని పి నాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.శ్రావణి,ఎఎన్ఎం డి. కృష్ణకుమారి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. రమేష్,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. ఏసుదాసు, ఐ. గోవిందమ్మ, మంచా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి-తర్లుపాడు

మండల పరిధిలోని లక్ష్మక్కపల్లి ఎంపిపి స్కూల్‌లో చదవుతున్న విద్యార్థులకు మార్కాపురం వాసవీ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, పెన్నులు, మిఠాయిలు ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కశ్శెట్టి జగన్‌బాబు, వాసవీ విజన్ క్లబ్ అధ్యక్షులు గుర్రం రామారావు, జోన్ చైర్ పర్సన్ పోలేపల్లి వెంకట లక్ష్మీనారాయణ, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గంగిశెట్టి కిరణ్‌కుమార్, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెలుగూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు షేక్ అబ్దుల్‌సుకూర్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ విద్యార్థులకు

అందని ఉపకార వేతనాలు

ఆందోళనలో తల్లిదండ్రులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ముస్లిం మైనార్టీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఉపకార వేతనాలు గతేడాది నుంచి అందడం లేదు. జిల్లాలో 12 వేల మంది వరకు లబ్ధి పొందేవారు. 2022-23కు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరించారు. నిధులు విడుదల చేయలేదు. ఈ ఏడాది దరఖాస్తులు కూడా స్వీకరించలేదు. విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసేందుకు మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

కోర్సులకు అనుగుణంగా..

ముస్లిం మైనార్టీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్, మెరిట్ కామ్ మీన్స్ ఉపకార వేతనాలు గతంలో అందించేది. ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు రూ. వెయ్యి, 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు రూ.5 వేల వరకు ప్రతి సంవత్సరం ఇచ్చేవారు. పోస్టుమెట్రిక్, వత్తి విద్యలో ఆయా



కోర్సులకు తగ్గట్టు రూ.5 వేల నుంచి రూ. 10 వేలు 2021-22 వరకు అందించారు. అనంతరం ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో ఉపకార వేతనాలు ఇస్తారో, లేదోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

దరఖాస్తు చేసుకున్నా..

రాష్ట్ర ప్రభుత్వం అందించే వసతి దీవెనతో సంబంధం లేకుండా కేవలం ముస్లిం మైనార్టీలకు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌తో దరఖాస్తు చేసుకున్న వారికి ఉపకార వేత నాలు అందేవి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల అనే నిబంధనలు కూడా లేవు. ఈ ఉపకార వేతనం రాకపోవడం, అటు వసతి దీవెన అందని ముస్లిం మైనార్టీ విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపకార వేతనాలు అందించాలి

షేక్ ఇస్మాయిల్, ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షుడు,



ముస్లిం మైనార్టీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వం గతంలో ఉపకార వేతనాలు మంజూరు చేసేది. దాన్ని గతేడాది నుంచి నిలుపుదల చేసింది. ఫలితంగా ముస్లిం పేదలు విద్యార్థులను చదివించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం తిరిగి ముస్లిం మైనార్టీలకు ఉపకార వేతనాలు అందించి ఆదుకోవాలి

పొగాకు కిలో అత్యధిక ధర రూ.277

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక కొండపి రోడ్డులోని పొగాకు బోర్డులో మంగళవారం పొగాకు కిలో అత్యధిక ధర రూ.277 పలికింది. పొలం వేలం తీరు, నాణ్యమైన పొగాకుకు వ్యాపారులు వేస్తున్న ధరలను బోర్డు ప్రాంతీయ అధికారి ఎం.లక్ష్మణరావు పరిశీలించారు. ఈ ఏడాది బోర్డు ప్రారంభమైన 5 నెలల కాలంలో ఇదే అత్యధిక ధరగా నమోదైంది. బోర్డు ప్రారంభం నుంచి కిలో పొగాకు రూ.240, రూ.250 పలికింది. గత నెల 27న అత్యధికంగా రూ.273 ధర పలికింది. బోర్డు పరిధిలోని తూర్పు నాయుడుపాలెం, కాకుటూరువారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1,201 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 1,148 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాలతో 53 బేళ్లను తిరస్కరించారు. పొగాకు కిలో అత్యధిక ధర రూ.277, అత్యల్ప ధర రూ.162, సరాసరి ధర రూ.262.19 పైసలు నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.

ఇతర దేశాలలో పొగాకు కొరత ఉన్నందువల్లనే మనదేశంలో పొగాకుకు ఈ ఏడాది అత్యధిక ధర లభిస్తుందని టంగుటూరు ఫ్లోర్ కమిటీ అధ్యక్షుడు, నల్లరేగడి నేలల పొగాకు రైతుల సంఘం అధ్యక్షుడు పోతుల నరసింహారావు తెలిపారు. ఈ ఏడాది ధరలను చూసి రైతులు ఇప్పటి నుంచే పొగాకు సాగు కోసం అత్యధిక ధరకు భూములను కౌలుకు తీసుకుంటున్నట్లు తెలిపారు. బ్యారన్లను లీజులు దాదాపు 5 రేట్లు పెంచినట్లు అద్దెకు తీసుంటున్నట్లు తెలిపారు. కొత్త బ్యారన్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. బోర్డు అధికారులు, సంఘం నాయకులు రైతులకు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ వారు పెడచెవిన పెట్టడం ఆందోళన కలిగిస్తుందన్నారు. రైతులు తొందరపడవద్దని, బోర్డు నిబంధనలకు మేరకు పొగాకును సాగు చేయాలని పోతుల నరసింహారావు రైతులకు సూచించారు.



పొగాకు వేలం తీరును పర్యవేక్షిస్తున్న ఆర్ఎం లక్ష్మణరావు

జగన్ మాయమాటలు నమ్మి మైనార్టీలు మోసపోవద్దు

కాంగ్రెస్ అధికార ప్రతినిధి షేక్ సైదా

ప్రజాశక్తి-పొదిలి



ముస్లిం యువతను మరోసారి మోసగించేందుకు సిఎం జగన్ సన్నద్ధమవుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సైదా తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ఉపాధి శిక్షణ-నోటిఫికేషన్ జారీ పేరుతో దగా చేస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా ముస్లిం మైనార్టీలపై బిజెపి దాడులు చేస్తున్న ఖండించక పోవడం దారుణమన్నారు. పార్లమెంట్ సాక్షిగా బిజెపి ప్రవేశపెట్టిన ముస్లిం వ్యతిరేక నల్ల చట్టాలకు నిసిగ్గుగా జగన్ మద్దతు తెలిపినట్లు తెలిపారు. దేశంలో మత సామారస్యతను కాపాడుకోవటం కోసం కాంగ్రెస్ పార్టీ అనేక త్యాగాలు చేసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చేసేందుకు, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చేందుకు ముస్లిం మైనార్టీలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలన్నారు.

డీప్‌బోరుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి నగర పంచాయతీ పరిధిలోని టైలర్స్ కాలనీలో డీప్ బోర్ నిర్మాణానికి మున్సిపల్ ఎఇ భూపాల్ రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి పట్టణ మాజీ అధ్యక్షుడు షైక్ రబ్బానీ ఆధ్వర్యంలో డీప్ బోర్ పనులు మంగళవారం ప్రారంభించారు.

రుణాలకు 218 దరఖాస్తులు

ప్రజాశక్తి-కొండపి

ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పిఎంఇజిపి),ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజస్ స్కీమ్(పిఎంఎఫ్ఎంఇ) ద్వారా రుణాలకు 218 అప్లికేషన్లు వచ్చినట్లు డిపిఎం డేవిడ్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో కొండపి, మర్రిపూడి , పొన్నలూరు మండలాల లబ్ధిదారుల అప్లికేషన్లను మంగళవారం పరిశీలించారు. కొండపి మండల నుంచి 75, మర్రిపూడి నుంచి 60, పొన్నలూరు నుంచి 83 మంది లబ్ధిదారులకు అప్లికేషన్లు పరిశీలించి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ సనిత, మూడు మండలాల ఎపిఎంలు, సిసిలు, విఒఎఎస్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిడిఒ షేక్ జమీఉల్లా ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉప ఎన్నికలకు సంబంధించి అధికారులకు విధులు కేటాయించారు. ఎన్నికల నియమావళి గురించి వారికి వివరించారు. పాకల గ్రామపంచాయతీ సర్పంచి ఉప ఎన్నికలకు అధికారిగా ఊళ్ళపాలెం ప్రధానోపాధ్యాయుడు జిఎస్‌కెవి.ప్రసాద్, శింగరాయకొండ 16వ వార్డు ఉప ఎన్నికల అధికారిగా పాకల ప్రధానోపాధ్యాయుడు పివిఎస్. ప్రసాద్, మూలగుంటపాడు 10వ వార్డు ఉప ఎన్నికల అధికారిగా ఎంఇఒ-2 ఆవుల శ్రీనివాసరావును నియమించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి సుధాకర్, పాకల పంచాయతీ కార్యదర్శి సుభాని తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిల్ అందజేత

కొమరోలు : టిడిపి మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, రాచర్ల మండలానికి చెందిన దూదిపల్లి నరసింహులు ఆధ్వర్యంలో ఓ వికలాంగుడికి అమ్మఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ట్రై సైకిల్ అందజేశారు. రాచర్ల మండల పరిధిలోని కాలవపల్లి గ్రామానికి వికలాంగుడు గురుపుసాల పెద్దిరాజుకు ట్రైసైకిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ చైర్మన్, టిడిపి మండల అధ్యక్షుడు బోనేనీ వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ భూపాల్, చిన్నరాజయ్య, కోటేష్ , ఆవులయ్య, బాషా పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

దర్శి : దళిత సంఘాల ఆధ్వర్యంలో కళాకారుడు గద్దర్ చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రేమ్‌కుమార్, జూపల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ గద్దర్ తెలుగు రాష్ట్రాలలో గొప్ప కళాకారుడుగా గుర్తింపు పొందారన్నారు. గద్దర్ దళితుల సమస్యలపై పోరాటాలు చేసేవారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు జివి.తర్నం, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా ద్వారకచర్ల యువతి


ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలం ద్వారకచర్ల గ్రామానికి చెందిన బొడ్డు జ్యోతి తెలంగాణాలో నిర్వహించిన ఎస్ఐ పరీక్షల్లో సత్తా చాటారు.2022 ఏప్రిల్‌లో విడుదల చేసిన ఎస్ఐ నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసుకున్న జ్యోతి తిరుపతిలోని ఓ ప్రైవేట్ సైనిక పాఠశాలలో పిఇటిగా విధులు నిర్వహిస్తు ఎస్ఐ పరీక్షలకు శిక్షణ పొందింది. ప్రస్తుతం తెలంగాణా రాష్ట్రంలో ఎఆర్ ఎస్ఐగా జ్యోతి ఉద్యోగానికి ఎంపికైంది. ఈ సందర్భంగా జ్యోతిని పలువురు అభినందించారు.

పున్నయ్యచౌదరికి డాక్టరేట్

ప్రజాశక్తి-చీరాల

ఆస్ట్రేలియా జేవియర్ హార్వర్డ్ సెయింట్ మదర్ తెరిసా విశ్వవిద్యాలయం నుంచి సెయింట్ మదర్ థెరిసా విశ్వ విద్యాలయం ద్వారా మలేషియాలోని కౌలాలంపూర్లో కరణం పున్నయ్య చౌదరికి డాక్టరేట్‌ను మంగళవారం ప్రదానం చేసింది. ఆస్ట్రేలియాలోని సెయింట్ మదర్ థెరిస్సా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కౌలాలంపూర్లో కాన్వొకేషన్లో డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ పున్నయ్య చౌదరి బ్యాడ్మింటన్లో 1965-66లో పాటియాలలో మొదటి ఎన్‌ఐఎస్‌లో డిప్లొమా కోచ్‌గా పనిచేశారు. మరియు భారతదేశానికి చెందిన 1వ బిడబ్ల్యూఎఫ్ ఇంటర్నేషనల్ అంపైర్ (ప్రపంచంలోని 36 మంది అంపైర్లలో) తర్వాత భారతీయ కోచ్ పనిచేశారు. క్రీడలలో కోచ్ గాను, అంపైర్గానూ, అడ్మినిస్ట్రేటర్గా సుమారు 60 ఏళ్లపాటు బ్యాడ్మింటన్‌కు



డాక్టరేట్ తీసుకుంటున్న కరణం పున్నయ్యచౌదరి

సేవలందించారు. అరవై కంటే ఎక్కువ జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లకు కార్యదర్శి, మరియు డి డైరెక్టర్ సాప్‌గా ఆయన బ్యాడ్మింటన్‌కు సంబంధించిన వివిధ అసైన్మెంట్లలో 50కి పైగా దేశాలను కూడా సందర్శించాడు. పాత మద్రాసు రాష్ట్రం 1968కి ప్రాతినిధ్యం వహిస్తూ హిమాలయాలలో 3 భాగేరథి శిఖరాలను విజయవంతం చేసి క్లెయిమ్ చేసింది. క్రీడల నుంచి రిటైరయ్యి ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్లోని తన స్వగ్రామం అయిన ఇంకొల్లులో వ్యవసాయం, విద్యా సంస్థలను చూస్తున్నారు. భార్య నాగేంద్రమ్మ గృహిణి, పెద్ద కొడుకు వెంకన్నబాబు యూఎస్‌లో, చిన్న కొడుకు డాక్టర్ హరీష్‌బాబు చెన్నైలో ఉంటున్నారు. ఎందరో క్రీడాకారులను దేశానికి పరిచయం చేసి వారి నైపుణ్యాన్ని వెలికితీసి నేడు ఆస్ట్రేలియాలో పేరుగాంచిన విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌తో పున్నయ్య చౌదరిని సత్కరించటం పట్ల సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎద్దుల బండ్లకు రేడియం స్టిక్కర్స్

ప్రజాశక్తి -చిన్నగంజాం

రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు, ఇతర వాహనాలకు సిగ్నల్ ఇచ్చేందుకు అన్ని రకాల వాహనాలకు ఎర్రలైట్ వినియోగించడం సహజం. కానీ ప్రధాన రహదారుల మీద ప్రయాణించే ఎద్దుల బండ్లకు కూడా కచ్చితంగా సిగ్నల్ వ్యవస్థ ఉండాలని తద్వారా ప్రమాదాలను తగ్గించ వచ్చని ఎస్సై సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని సోపిరాల, కడవకుదురు, మున్నావారిపాలెం తదితర గ్రామాల్లోని ఎడ్లబండ్ల నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. ప్రతి బండి ముందు, వెనుక భాగాలలో రేడియం స్టిక్కర్స్ అతికించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. జిల్లా ఎస్‌పి సూచనల మేరకు ప్రతి ఒక్కరూ తమ బండ్ల కు రేడియం స్టిక్కర్స్ కచ్చితంగా అంటించాలని దగ్గర ఉండి మరీ అంటించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల దగ్గరకే..

ప్రజాశక్తి-మేదరమెట్ల

ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయి, ఇంకా ఏమైనా అందాలా అనే విషయాలను తెలుసుకునేందుకే 'గడప గడపకూ' కార్యక్రమం అని అద్దంకి వైసిపి ఇన్‌ఛార్జ్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. మంగళవారం కొరిశపాడు మండలంలోని పమిడిపాడు-1 సచివాలయ పరిధిలో గడప గడపకూ ప్రోగ్రాంలో ఆమె పాల్గొన్నారు. జగన్మోహన్ రెడ్డి పథకాలన్నీ ప్రజలకు అందే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పథకాలు ఎలా అందుతున్నాయి అనే అంశం మీద కూడా ప్రజలతో నాయకులు మమేకమయ్యే విధంగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సాదినేని ప్రసన్నకుమారి, మండల కన్వీనర్ సాదినేని మస్తాన్‌రావు, రావి శ్రీధర్, కేసరి వెంకటరెడ్డి, బొట్టు రక్షణతో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9న లోక్ అదాలత్

ప్రజాశక్తి అద్దంకి

జాతీయ లోక్ అదాలత్ స్థానిక కోర్టు సముదాయం ఆవరణలో సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహించబడుతుందని చైర్మన్ మరియు సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవాధికార సంస్థ బి బాబునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ చేయబడే క్రిమినల్, సివిల్ కేసులు మరియు బ్యాంకు చెక్కులు ఫ్రీ లిటికేషన్ కేసులు పరిష్కరించబడతాయన్నారు. కోర్టు పరిధిలోని కక్షిదారులందరూ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు.

వేగవంతంగా ఓటర్ల జాబితా సర్వే

ప్రజాశక్తి-రేపల్లె

నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితాల సర్వేను వేగవంతంగా నిర్వహించాలని అధికారులకు ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి జాన్‌పీటర్ సూచించారు. ఓటర్ల సర్వేపై స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో విస్తతంగా జరుగుతున్న సర్వేపై అభ్యంతరాలు ఉంటే ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలియజెప్పాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు పొందేలా అధికారులతో పాటు ఆయా పార్టీల ప్రతినిధులు చైతన్యపరచాలని కోరారు. సమావేశంలో అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతతను దెబ్బతీసేందుకే అసత్య ప్రచారం

ప్రజాశక్తి-పర్చూరు

గ్రామాలలో ప్రశాంతతను దెబ్బతీసేందుకే వైసిపి నాయకులు దొంగ ఓట్ల పేరుతో అసత్య ప్రచారం చేస్తున్నారని టిడిపి మండల అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, సీనియర్ నాయకులు కొరిటాల సురేష్ అన్నారు. పర్చూరు పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయ ప్రయోజనాల కోసం ద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయటం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు మక్కెన శేఖర్‌బాబు, ఎంపిటిసి సభ్యులు కాపు రవిచంద్ర, శిరిగిరి నాగేశ్వరరావు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పరిధిలో లేవని చెబితే చర్యలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ లో ఆరోగ్య శ్రీ పథకం పై ఆరోగ్య మిత్రలతో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఏపీ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదల అశోక్ బాబు మాట్లాడుతూ ధనవంతులతో సమానంగా పేదవారికి కూడా కార్పొరేట్ వైద్యం అందించాలని సీఎం జగన్ మోహన్ రెడ్డి వైద్య రంగంలో దాదాపు 48 వేల పైచిలుకు పోస్టులను వైద్య రంగంలో భర్తీ చేశారన్నారు. కార్పొరేట్ హాస్పిటల్ కు వచ్చిన పేదవారికి ఓపి దగ్గర నుంచి హాస్పటల్లో అడ్మిట్ అయ్యి ఇంటికి వెళ్లి విశ్రాంతి సమయంలో వైయస్సార్ ఆరోగ్య ఆసరా డబ్బులు కూడా పడే విధంగా ఆరోగ్య మిత్రలు పేదవారికి అన్ని విధాల అండగా ఉండాలని ఆయన తెలిపారు. కొన్ని హాస్పిటల్స్ లో ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న జబ్బులను కూడా లేవని చెప్పి పేదవారి దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారని అలాంటి హాస్పిటల్ పై చర్యలు తీసుకుంటామని అన్నారు. పేదవారు ఏ ట్రీట్మెంట్ కు ఎవరి దగ్గరికి వెళ్ళాలో తెలియదని వారికి ఆరోగ్య మిత్రలే అన్ని విధాలుగా సపోర్ట్ గా ఉండాలని ఆరోగ్య మిత్రలు హాస్పిటల్ కు ఒక మూల స్తంభం అని ఆయన అన్నారు. ఆరోగ్య మిత్రాలే హాస్పటల్లో హీరోలని,సీఎం జగన్ మోహన్ రెడ్డి గారు వైద్య రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చి హాస్పిటల్స్ లో ఆరోగ్య మిత్రులను ఒక కీలకంగా తయారు చేశారని,అలాంటి ఆరోగ్య మిత్రలు ఎవరికి భయపడకుండా జగన్మోహన్ రెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి పేదవారికి నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని డాక్టర్ యాదల అశోక్ బాబు గారు తెలియజేశారు. మీకు ఏదైనా సమస్య ఉంటే వెంటనే నా నెంబర్ను సంప్రదించాలని అశోక్ బాబు గారి నెంబరు 9866641053 ఆరోగ్య మిత్రులకు తెలియపరిచారు. 24 గంటలు పేదవారికి,ఆరోగ్య మిత్రులకు అందుబాటులో ఉంటానని తెలిపారు.ఇప్పటివరకు ఏ హాస్పిటల్ కూడా ప్రభుత్వం నుంచి ఎలాంటి బకాయి లేదన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పర్చూరు

అంగన్‌వాడీ కేంద్రాలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొన్ని కేంద్రాలలో నిబంధనలు పాటించకపోవటాన్ని గుర్తించినట్లు సిఐ ఏ శ్రీహరిరావు తెలిపారు. పౌష్టికాహారం పంపిణీ పుస్తకంలో లబ్ధిదారుల సంతకాలు లేకపోవటం, గుడ్లు నిర్ణీత పరిమాణం కన్నా తక్కువగా ఉండటం, కొన్ని కేంద్రాలకు మరుగుదొడ్లు, ప్రహరీ గోడ లేకపోవటం తదితర అంశాలను అధికారులు గుర్తించారు. నూతలపాడు కేంద్రంలో తాగునీరు సౌకర్యం ఉన్నా ఉపయోగించుకోలేని పరిస్థితి ఉందన్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం చిరుతిండి సక్రమంగా ఇవ్వటం లేదనేని తన పరిశీలనలో తేలిందన్నారు. ఆయన వెంట సిడిపిఓ జి సుభద్ర, సూపర్‌వైజర్లు ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ చేస్తున్న సర్పంచ్

కొల్లూరు: కొల్లూరు మండలం తోకల వారిపాలెంలో సర్పంచి టి కృష్ణమోహన్ మంగళ వారం అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కేంద్రాలలో క్రమం తప్పకుండా ప్రభుత్వం అమలు చేసే పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని కార్యకర్తలకు సూచించారు. దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్‌తో కలసి పరిశీలించిన అనంతరం ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్లను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. రిజిస్టర్లు స్టాకును పరిశీలించారు.

చేనేత పరిశ్రమను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంకొల్లు ఆదర్శ హైస్కూలు విద్యార్థులు వేటపాలెంలో చేనేత పరిశ్రమను సందర్శించారు. చేనేత కార్మికులు చేస్తున్న పని విధానాన్ని పరిశీలించారు. చేనేతల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. తెలుగు రాష్ట్రాలలో చేనేతలకు ఘన మైన చరిత్ర ఉందని ఆదర్శ హైస్కూలు కరస్పాండెంట్ తోటకూర విజయ భాస్కర్ వివరించారు. చేనేత పరిశ్రమను సందర్శించిన వారిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు. జాతీయ చేనేత దినోత్సవం ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. చేనేత వస్త్ర దినోత్సవంపై పాఠశాల విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు టి ఆది నారాయణ, పాఠశాల బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొని చేనేత వస్త్ర పరిశ్రమ ఆవశ్యకతను గురించి తెలియజేశారు.


చీర నేసే విధానాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

నాటుసారా తయారుచేస్తే చర్యలు

సెబ్ సీఐ లీనా

ప్రజాశక్తి-రేపల్లె

నాటుసారాను విక్రయించినా, తయారు చేసినా చర్యలు తప్పవని సెబ్ సీఐ లీనా అన్నారు. మండలంలోని గుడ్డికాయలంక గ్రామంలో మంగళవారం సెబ్ సిబ్బంది ఆకస్మిక దాడులు నిర్వహించి అనంతరం మాట్లాడారు. ప్రభుత్వ నిషేధిత పదార్థాలను ఎవరైనా తయారు చేసినా, విక్రయించినా గ్రామస్తులు తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. గుడ్డికాయలంక గ్రామంలో ఉయ్యూరు సామ్రాజ్యం గృహంలో దాడులు నిర్వహించగా నాటుసారా తయారు చేసే 50 లీటర్ల బెల్లంఊట, 4 లీటర్ల నాటుసారా లభ్యమయ్యాయన్నారు. వీటిని ధ్వంసం చేసినట్లు చెప్పారు. నిందితురాలిని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరిచినట్లు చెప్పారు.

కార్యకర్త కుటుంబానికి

కొండయ్య ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వేటపాలెం

టిడిపి కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ రావూరుపేటలో ఇటీవల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గౌరాబత్తుని వెంకటేశ్వర్లు (వెంకన్న) మరణించగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అధైర్య పడవద్దు అని పార్టీ కుటుంబానికి అండగా నిలబడుతుందని ధైర్యంగా ఉండాలని అన్నారు. అనంతరం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఒలుకుల కోటయ్య, పత్తిపాటి భాస్కరరావు, వెంగళ భరత్ ఒలుకుల అయ్యప్ప, దుర్గారావు బుద్ధి కుమార్, తేలప్రోలు నాగేశ్వరావు, కౌతరపు జనార్దనరావు, నరాల తిరుపతి రాయుడు, దగ్గుబాటి వెంకటరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

శ్రామిక గర్జనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

విజయవాడలో నిర్వహించ తలపెట్టిన శ్రామిక మహా గర్జనను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ వేమూరి నియోజకవర్గ అధ్యక్షులు బండారు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 9న క్విట్ ఇండియా డే సందర్భంగా ఈ మహాగర్జన జరుగుతుందన్నారు. ఈ గర్జనకు నియోజకవర్గంలోని భవన నిర్మాణ కార్మికులు వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వి శ్రీనివాసరావు ఉన్నారు.



చంద్రబాబు మాటలు నమ్మొద్దు

మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

మరోమారు చంద్రబాబు మోసపు మాటలు నమ్మవద్దని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రజలను కోరారు. మండలంలోని పాత ముడివేముల గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధి గురించి, ప్రజా సమస్యల గురించి మంత్రి తెలుసుకున్నారు. ఇంటి స్థలాలు లేని వారిని గుర్తించి వెంటనే స్థలాలు మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలు, రైతులు, మహిళలను దష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు రూపొందించినట్లు చెప్పారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గాలి మాటలను ప్రజలు నమ్మరని, ఏపీలో అమలవుతున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వారికి మరోసారి గుణపాఠం తప్పదని అన్నారు. సంక్షేమ పాలనతో ప్రజల గుండెల్లో సీఎం వైఎస్ జగనన్న సుస్థిరస్థానం పొందారని, రాష్ట్రంలో మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుందని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలన్నదే సీఎం జగనన్న అభిమతమన్నారు. అనంతరం ఆ గ్రామంలో జల జీవన్ మిషన్ పథకం ద్వారా రూ. 14 లక్షలు వ్యయంతో ఏర్పాటు చేసిన ఇంటింటికి తాగునీటి కుళాయిలను ప్రారంభించారు. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి, డిఎల్‌డివో బివిఎన్ సాయికుమార్, తహశిల్దార్ కిరణ్, ఎంపిడివో సత్యనారాయణ, వైసిపి నాయకులు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిగా న్యాయశాఖ ఉద్యోగి ఎంపిక

ప్రజాశక్తి-ఒంగోలు



కె.సురేంద్రరెడ్డి

అద్దంకి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో టైపిస్టుగా పనిచేస్తున్న కె.సురేంద్రరెడ్డి సోమవారం హైకోర్టు వారు ప్రకటించిన జూనియర్ సివిల్ జడ్జి ఫలితాలలో న్యాయ శాఖ ఉద్యోగుల జాబితాలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచారు. న్యాయమూర్తిగా ఎంపిక అయ్యారు. సురేంద్ర రెడ్డి న్యాయశాఖలో 2001లో చిన్న వయసులోనే కాంట్రాక్ట్ బేసిస్ మీద ఉద్యోగంలో చేరారు. 2006లో రెగ్యులర్ ఉద్యోగం సంపాదించారు. హైకోర్ట్ వారి అనుమతితో లా డిగ్రీ చదివి, న్యాయ శాఖ ఉద్యోగుల కేటగిరిలో జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలకు పట్టుదలతో చదివి ఉన్నతస్థాయిని అలంకరించారు.. ఈ సందర్భంగా సురేంద్రరెడ్డిని పలువురు న్యాయశాఖ ఉద్యోగులు, న్యాయవాదులు అభినందించారు.. సురేంద్రరెడ్డి డిపార్ట్మెంట్‌లో చేరిన తర్వాత హైకోర్ట్ వారి అనుమతితో నాగార్జున యూనివర్సిటీ నుండి లా పట్టాను, ఆంధ్ర యూనివర్సిటీ నుండి ఎల్ఎల్ఎం పట్టాను పొంది, నిరంతర శ్రమ తో ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారు.. కాగా, సరిగ్గా 5 సంవత్సరాల క్రితం సురేంద్ర రెడ్డి యొక్క అన్న నరేంద్ర రెడ్డి కూడా న్యాయశాఖ ఉద్యోగుల కేటగిరి లో న్యాయమూర్తిగా ఎన్నికయ్యారు. ఇప్పుడు చిలకలూరిపేటలో జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తుండటం గమనార్హం. జిల్లాలోని మద్దిపాడు మండలం ఇనమనమేళ్లూరు గ్రామంలో సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన అన్నదమ్ములిద్దరూ న్యాయమూర్తులుగా ఎన్నికవడం విశేషం. సురేంద్రరెడ్డి ఒంగోలులోని జర్నలిస్టు కాలనీలో నివాసముంటున్నారు.











